క్లుప్తంగా

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ అడ్లూరి



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విప్‌లు

ధర్మపురి: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

వర్షాకాలంలో నీటి నిల్వ లేకుండా చూడాలి



సిరికొండలో పనులు పరిశీలిస్తున్న ఎంపీవో

కథలాపూర్: వర్షాకాలంలో ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా ప్రజలు చూడాలని ఎంపీవో ప్రవీణ్ అన్నారు. మండలంలోని చింతకుంట, సిరికొండ గ్రామాల్లో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయా వాడల్లో పర్యటించి వర్షపునీరు నిల్వలుంటే వాటిని సిబ్బందితో తొలగింపజేశారు. ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పలువురి ఇళ్లలో వారంరోజులుగా నిల్వ ఉంచిన నీటిని పారబోయించారు. ఆయన వెంట కార్యదర్శులు నర్సారెడ్డి, మోహన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మల్యాల: మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం జిల్లా మహిళా సాధికారిత బృందం, షీ టీం, మానవ అక్రమ రవాణా నియంత్రణ టీంల ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ, షీ టీం సేవలను వివరించారు. బేటీ పడావో, బేటీ బచావో పథకంతోపాటు, పోక్సో చట్టం, ఆపద సమయంలో ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవికుమార్, అలీ బేగ్, అహ్మద్ పాషా, సౌజన్య, అశ్విని, గౌమతి, స్వప్న, హేమశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి బోనాలకు ఏర్పాట్లు పూర్తి

మెట్‌పల్లి: పట్టణంలో ప్రతి ఏటా ఆషాడంలో నిర్వహించే మహాలక్ష్మి బోనాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం పరిసరాలు శుభ్రం చేసే పనులను కమిషనర్ మోహన్ పరిశీలించారు. బోనాలను పురస్కరించుకుని ప్రతి రోజు పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.

ఆజాద్ జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న బీఎస్‌ఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం పాల్గొన్నారు.
రాయికల్: మండలంలోని రామాజీపేటలో స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆకుల మహేశ్, నాయకులు గంగస్వామి, రాహుల్, రాజు, భూమేశ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మేడిపల్లి: మండల కేంద్రానికి చెందిన అరవింద్, దేశాయిపేట గ్రామానికి చెందిన మధుకుమార్ తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తించారు. మంగళవారం ఎస్సై శ్యాంరాజ్ వారికి అందించారు.

నాలుగేళ్లుగా అరకొర సేవలే!

- వెన్గుమట్ల వైద్యశాలలో వైద్యుడి పోస్టు ఖాళీ
- వీలైనప్పుడు వచ్చి సేవలందిస్తున్న ఇన్‌చార్జి డాక్టర్
- పశువులకు అందని సరైన వైద్యం



వెన్గుమట్లలో తాళం వేసి ఉన్న పశువైద్యశాల

గొల్లపల్లి: మండల పరిధిలో పశువులకు చికిత్స అందించడం కోసం గొల్లపల్లి, వెన్గుమట్ల గ్రామాల్లో రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. అయితే వెన్గుమట్ల ప్రభుత్వ పశువైద్యశాలలో సమస్యలు వెంటాడుతున్నాయి. నాలుగేళ్లుగా శాశ్వత వైద్యాధికారి లేక రైతులు, పశుపోషకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో 50 కిలోమీటర్ దూరంలో ఉన్న మెట్‌పల్లి పశువైద్యాధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. గత కొంత కాలంగా గొల్లపల్లి పశువైద్యాధికారిగా పనిచేసి ఇక్కడి నుంచి వెన్గుమట్లకు ఇన్‌చార్జిగా పనిచేశారు. మళ్లి మెట్‌పల్లికి బదిలీపై వెళ్లడంతో అక్కడి నుంచి ఇక్కడికి అప్పుడప్పుడు పశువైద్యశాలకు వస్తూ ఇన్‌చార్జిగా సేవలందిస్తున్నారు. వెన్గుమట్ల పశువైద్య శాలకు పర్మినెంట్ డాక్టర్ లేకపోవడంతో పశువైద్యశాల నుంచి రైతులకు సబ్సిడీపై అందవలిసిన పశుగ్రాసం, విత్తనాలు, మందులు అందడం లేదు. దీంతో పశువైద్యశాల పరిధిలోని లొత్తునూర్, బొంకూర్ గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ ఉన్నప్పటికీ వైద్యుడు లేక పోవడంతో మధ్యాహ్నం తరువాత వైద్యశాలకు తాళాలు వేసి దర్శనమిస్తోంది. దీంతో సాయంత్రం సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా వెన్గుమట్ల పశువైద్యశాలకు పూర్తి స్థాయి వైద్యాధికారిని నియమించాలని రైతులు, పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లన్నపేటలో..
మల్లన్నపేట సబ్ సెంటర్‌లో నాలుగేళ్లుగా జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ కూడ పశువులకు వైద్య సేవలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కల్లూరు చెక్ డ్యామ్‌కు జలకళ



కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు గ్రామ శివారులో పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ జలకళను సంతరించుకుంది. గత వేసవిలో బోసిపోయిన వాగు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్‌లో నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

గొల్లపల్లి: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ అన్నారు. గొల్లపల్లిలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలు గడిచిన రెవెన్యూ చట్టాలు మారిన భూ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ధరణి వెబ్‌సైట్‌తో రైతులు భూ సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బంగుడపు తిరుపతి, జిల్లా కార్యదర్శి కాళ్ళ రాజయ్య, కందుకూరి తిరుపతి, కొమురెల్లి పాల్గొన్నారు.

ఉద్యానవనం పనులు వేగవంతం చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి



పార్క్‌లో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ఉద్యానవనం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్క్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఆహ్లాదం అందించే పార్క్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
ప్రజాసమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజాదర్బార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్యలున్నా నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసేందుకు కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దు

సారంగాపూర్: రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ రఘువరణ్ అన్నారు. జిల్లాలోని సింగిల్‌విండోల సీఈవోలు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. రూ.లక్ష లోపు రుణం ఉన్నా మాఫీకాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీ కాకుంటే వ్యవసాయ విస్తీర్ణాధికారులను సంప్రదించాలని రఘువరణ్ సూచించారు.

ఎన్పీడీసీఎల్ సబ్ డివిజన్‌ను కొనసాగించండి

మల్లాపూర్: ఎన్పీడీసీఎల్ సబ్ డివిజన్ కేంద్రాన్ని ఇక్కడే కొనసాగించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. రైతులతో కలిసి డీఈ తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందించారు. రెండేళ్ల కిత్రం మల్లాపూర్, రాఘవాపేట, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి సెక్షన్లతో కలిపి మల్లాపూర్‌లో సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారని, దానిని మెట్‌పల్లి రూరల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని తీర్మానం చేసిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకేట నారాయణరెడ్డి, రైతులు గడ్డం మల్లారెడ్డి, ఇట్టెడి నారాయణరెడ్డి, బండారి రమేశ్, మీనుగు కొండయ్య, కొమ్ముల శంకర్‌రెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మల్యాల: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఈ మేరకు రైతుభీమా దరఖాస్తులు ప్రదర్శించారు. 59 ఏళ్లలోపు రైతులు రైతుబీమాకు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రైతుబీమా పథకం కోసం అర్హులైన రైతులు ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫెరేన్స్ ద్వారా రైతునేస్తాన్ని కార్యక్రమాన్ని ఏఈవో, రైతులతో కలిసి ఆమె వీక్షించారు. జూన్ 28 వరకు కొత్త పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో గజానంద్, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గేదె మృతి

కథలాపూర్: మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఏరియాలో ఓ గేదెను కుక్కలు వెంబడించి దాడి చేయడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గేదె మేత మేస్తుండగా, కుక్కలు వెంబడించాయని, గ్రామశివారులోకి వెళ్లగానే కరవడంతో మృతిచెందిందన్నారు. గేదె ఎవరిదనే విషయం తెలియదని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ గ్రామంలోని ఓ కుటుంబానికి చెందిన ఇద్దరిని కులంపేరుతో దూషించి, దాడికి యత్నించిన ముగ్గురిపై పోలీసులు మంగళవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఈ నెల 11న నాగునూర్ గ్రామానికి చెందిన అరికిల్ల సురేశ్ ఇంటిలోకి మండలంలోని ఒడ్డెరకాలని గ్రామానికి చెందిన దండుగుల రమ, మరో ఇద్దరితో కలిసి అక్రమంగా ప్రవేశించి సురేష్ కుమార్తెను, సురేష్ బంధువైన నర్సమ్మను అసభ్య పదజాలంతో, కులంపేరుతో దూషిస్తూ, చెప్పుతో కొడుతుంది. ఈ సంఘటనపై సురేష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్ పరిధిలోని 11 కేవీ మోరపల్లి ఫీడర్, 11 కేవీ చల్‌గల్ ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దొంతి శ్రీధర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో పల్లెదవాఖాన ఏర్పాటు చేయాలని కోరుతూ విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3500 జనాభా ఉన్న భూపతిపూర్‌లో పల్లె దవాఖానాను ఏర్పాటు చేయాలని, గ్రామప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సోమ రమేశ్‌రెడ్డి, మామిడాల నాగరాజు, నరేశ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా రమేశ్

కోరుట్ల: కోరుట్ల పట్టణ భారతీయ జనతా పార్టీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కచ్చు రమేశ్‌ను నియమిస్తూ పట్టణ బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గంద్ర వెంకటేశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేకేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు

కోరుట్ల: పట్టణానికి చెందిన యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశాడు. కేకేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపాడు.

పాఠశాలకు ప్యూరిఫైర్ వితరణ
ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలకు జిల్లా సాయన్న జ్ఞాపకార్థం అతని కుమారులు జిల్లా గోపి, రమేశ్ రూ.10 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైర్‌ను అందచేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కృష్ణ ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

సారంగాపూర్: పత్తి పంటలో తెగుళ్లు, చీడ పీడలు నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో రైతులకు శాస్త్రవేత్తలు వివరించారు. మంగళవారం బీర్‌పూర్, సారంగాపూర్ మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు పంటలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనలను సలహాలు అందించారు. పశసంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అనూష, తిరుపతినాయక్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన
ఇబ్రహీంపట్నం: రైతులు పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.జి మహాదేవప్ప వివరించారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వరి, మొక్కజొన్న పంటలలో వచ్చే చీడ, పీడల తెగుళ్లపై శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

జగిత్యాలటౌన్/ మల్లాపూర్/మల్యాల: జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లి, వాల్గొండ ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, గైడ్లు, ఇతరసామాగ్రిని పంపిణీ చేశారు. మల్యాల జిల్లా పరిషత్ పాఠశాల బాలుర, బాలికల పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బోగ ఫౌండేషన్, నిర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజుల సుధీర్ ఉచితంగా నోటు బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ట్రస్ట్, ఫౌండేషన్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో సివిల్ సప్లై అధికారుల తనిఖీ

మేడిపల్లి: భీమారం మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో మంగళవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేపట్టారు. 2022–23, 2023–24 వార్షిక సంవత్సరానికి సామాజిక తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం నిల్వలు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీవో ఎన్.ఆనందకుమార్, మండల తహసీల్దార్ రవికిరణ్, మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వనమహోత్సవం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి గ్రామ పంచాయతీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలను అపహరించినట్లు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం చెర్లపల్లి గ్రామపంచాయతీలో టీ-ఫైబర్‌కు చెందిన మూడు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకువెళ్లారని, వీటి విలువ రూ.15 వేలు ఉంటుందని, టెక్నీషియన్ పారమాల మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ధర్మపురి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పట్టణంలో ముందస్తు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ, వార్డులో పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి నీటి గుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీరు నిల్ల ఉన్నచోట, టైర్లు, కూలర్లు, పాత కుండీల్లో నీరు ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మేనేజర్ గంగాధర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

‘కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిరాశ’

కథలాపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణకు చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలుంటే బడ్జెట్‌లో నిరాశ మిగిల్చారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఆలోచించాలని, తెలంగాణ అభివృద్ధి కోరుకునేది బీఆర్‌ఎస్ పార్టీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో సాగునీటిప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడం ఈ ప్రాంత ఎంపీల వైఫల్యమేనని మండిపడ్డారు.

‘దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడడం సరికాదు’

కథలాపూర్: దివ్యాంగులను కించపరిచేలా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ మాట్లాడడం సరికాదని జాతీయ దివ్యాంగుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్ అన్నారు. మంగళవారం కథలాపూర్‌లో మాట్లాడారు. ఐఏఎస్ హోదాలో ఉండి దివ్యాంగులపై వివక్షపూరిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేకపోతే తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగుల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం ప్రతినిధులు తీట్ల శంకర్, భూమేశ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు అమృత్ జల్ పరియోజన నిధులు

కోరుట్ల టౌన్: నియోజకవర్గంలోని మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్ జల్ పరియోజన నిధులు మంజూరయ్యాయని బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. కోరుట్లలో మంగళవారం మాట్లాడారు. ఈ పథకం కింద కోరుట్ల మున్సిపాలిటీకి రూ. 37.75 కోట్లు, మెట్‌పల్లి మున్సిపాలిటీకి రూ. 35 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చొరవతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడికి అభినందన

ధర్మపురి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో చురుకైన కార్యకర్తగా సేవలందిస్తున్న లక్ష్మణ్‌కు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మహనీయుల ఫొటోలను బహూకరించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం రాష్ట్ర సదస్సును నిర్వహించారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య లక్ష్మణ్ చేసిన సేవలపై ప్రశంసించారు. అనంతరం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్ చేతుల మీదుగా అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ చిత్ర పటాలను బహూకరించారు.

ఘనంగా సీత్లా భవాని వేడుకలు



అమ్మవార్లకు పూజలు చేస్తున్న మహిళలు

సారంగాపూర్: మండలంలోని మ్యాడారంతండా గ్రామంలో మంగళవారం లంబాడీ గిరిజన (బంజారాలు) సీత్లాభవానీ (యాడి) పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో అమ్మవార్ల ఆలయంలో లంబాడీలు తమ సాంప్రదాయ విధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి ఏడుగురు అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. గ్రామస్తులు డప్పు చప్పుల్లతో గొర్రెలు, మేకలను బలి ఇచ్చారు. ప్రకృతి చల్లగా ఉండి పుష్కలంగా పంటలు పండి, ఆరోగ్యంగా ఉండాలని వారు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ట్రాన్స్‌కో ఏడీఈ భూక్య జవహర్‌లాల్ నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, మాజీ జెడ్పీటీసీ భూక్య సరళ, మాజీ సర్పంచ్ భూక్య అరుణ్, మాజీ ఎంటీసీ భూక్య లావణ్యరాథోడ్, రాష్ట్ర బంజారా నాయకులు భూక్య దశరథ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా రేణుకాఎల్లమ్మ బోనాలు

కోరుట్ల: పట్టణ శివారులోని మాదాపూర్ కాలనీలో రేణుకాఎల్లమ్మ ఆలయంలో బోనాల జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బలిజ రాజరెడ్డి, ఆదిపెల్లి మహేశ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, రాము గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు మరో గండి



కాకతీయ కాలువకు పడిన గండి



గండి కొట్టి ప్రమాదకరంగా రోడ్డు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రం శివారులోని డీ24 కు ఎదురుగా కాకతీయ కాలువకు భారీగా గండి పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకతీయ కాలువ పై నుంచి భారీగా వరద వచ్చి గండి పడినట్లు రైతులు తెలిపారు. అధికారులు స్పందించి కాకతీయ కాలువకు పడిన గండిని పూడ్చి ప్రమాదకరంగా ఉన్న రోడ్డును కూడా పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.